క్లుప్తంగా

అధ్యాపకుడికి డాక్టరేట్



అధ్యాపకుడిని అభినందిస్తున్న కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి

కోట: విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఐఎస్టీలో ఈఈఈ విభాగంలో అధ్యాపకుడిగా పనిచేస్తున్న ములుమూడి రాజేష్‌కు శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది. ఆయన ఏఐ ఎనేబుల్డ్ పవర్ క్వాలిటీ ఎన్హాన్స్‌మెంట్ ఇన్ రెన్యువబుల్ ఇంటిగ్రేటెడ్ స్టాండ్ ఎలోన్ సిస్టమ్ అనే అంశంపై పరిశోధన చేశారు. ఈ క్రమంలో ఆయనకు ఎస్వీయూ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఆయనను కళాశాల డైరెక్టర్ విజయకుమార్ రెడ్డి, హెచ్‌వోడీ సురేష్‌రెడ్డి అభినందించారు.

ముమ్మరంగా కుష్టువ్యాధి నిర్మూలన సర్వే

ఓజిలి : మండలంలోని అత్తివరం గ్రామంలో సోమవారం వైద్య సిబ్బంది కుష్టువ్యాధి నిర్మూలనపై సర్వే చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి కుష్టువ్యాధిగ్రస్తుల వివరాలు సేకరించారు. చర్మంపై స్పర్శలేని మచ్చలు, మందమైన మెరిసే జిడ్డుగల చర్మం, చెవులు, వీపు, ఎదపై నొప్పిలేని బుడెపలు, కనురెప్పలు మూతపడకపోవడం, కాళ్లు, చేతులు తిమ్మిర్లు ఉంటే వైద్యులను సంప్రదించాలన్నారు. కుష్టువ్యాధిని ముందుగా గుర్తిస్తే నయం చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో యూహెచ్‌ఈ సుహాసిని, ఏఎన్ఎం కుసుమకుమారి, ఆశా సునంద పాల్గొన్నారు.

రిపబ్లిక్ డే పరేడ్‌కు ఎన్‌బీకేఆర్ ఐఎస్టీ విద్యార్థులు



కోట : ఈనెల 26న విజయవాడలో నిర్వహించనున్న రిపబ్లిక్ డే పరేడ్‌కు విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఐఎస్టీకి చెందిన ఎన్‌సీసీ విద్యార్థులు ఎస్.హరిక్రిష్ణ, గాయత్రి ఎంపికైనట్లు కళాశాల పీడీ మల్లికార్జునరెడ్డి తెలిపారు. వారు విజయవాడలో ఇస్తున్న శిక్షణ శిబిరంలో పాల్గొననున్నట్లు తెలిపారు. వారిని కళాశాల కరస్పాండెంట్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి అభినందించారు.

పేదలకు సేవ చేయండి



ఎమ్మెల్యేకు దుప్పట్లు అందజేస్తున్న పాస్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

చిల్లకూరు : నూతనంగా ఎన్నికైన సంఘ కాపరుల సంఘం ప్రతినిధులు తమ చర్చిల్లోని పేదలకు సేవ చేయాలని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ సూచించారు. గూడూరు పాస్టర్స్ అసోసియేషన్ నూతన కమిటీ సభ్యులు సోమవారం ఎమ్మెల్యేను కలిశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు దేవుని సేవ చేస్తూ పేదలకు అండగా ఉండాలన్నారు. అనంతరం పాస్టర్ల అసోసియేషన్ ప్రతినిధులు ఎమ్మెల్యేకు దుప్పట్లు అందించి పేదలకు పంపిణీ చేయాలని కోరారు. పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బక్కా రత్నశేఖర్, కార్యదర్శి డేవిడ్ ఇస్సాకు, దొరరాజు, యోహాను, విజయకుమార్, తాతాపూడి ఇజ్రాయేల్‌కుమార్ పాల్గొన్నారు.

పశువైద్య శిబిరాలు ప్రారంభం

రాపూరు: మండలంలోని కంబాలపల్లి, తెగచర్ల గ్రామాల్లో సోమవారం ఉచిత పశువైద్య శిబిరాలు ప్రారంభమయ్యాయి. సంక్రాంతిపల్లి పశువైద్యాధికారిణి సుప్రజ మాట్లాడుతూ జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకం కింద ఈ నెల 31 వరకు మండలంలోని అన్ని గ్రామాల్లోనూ ఉచిత పశువైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పశువుల్లో గర్భకోశ వ్యాధులకు చికిత్స, గొర్రెలు, మేకలకు వ్యాధి నిరోధక టీకాలు, నట్టల నివారణ మందులు వేస్తామన్నారు. రైతులు ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ముగిసిన క్రికెట్ టోర్నమెంట్



మాట్లాడుతున్న వెందోటి కార్తీక్‌రెడ్డి

బాలాయపల్లి(సైదాపురం) : సంక్రాంతి పండుగ సందర్భంగా బాలాయపల్లి మండలంలోని జయంపు గ్రామంలో నిర్వహించిన వీకేఆర్ క్రికెట్ టోర్నమెంట్ సోమవారం ముగిసింది. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వెందోటి కార్తీక్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ నెల 11న ప్రారంభమైన క్రికెట్ పోటీల్లో 22 జట్లు పాల్గొన్నాయి. సోమ వారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో జయంపు హరిజనవాడ, జయంపు అరుంధతీయవాడ జట్లు తలపడ్డాయి. జయంపు హరిజనవాడ జట్టు విన్నర్‌గా, జయంపు అరుంధతీయవాడ జట్టు రన్నర్‌గా నిలిచాయి. వెందోటి కార్తీక్‌రెడ్డి విన్నర్ జట్టుకు రూ.10, రన్నర్ జట్టుకు రూ.5 వేలు, షీల్డ్‌ను బహూకరించి అభినందించారు. ఆయన మాట్లాడుతూ యువత చదువుతోపాటు క్రీడలపైనా మక్కువ పెంచుకోవాలని సూచించారు. యువతలో దాగిఉన్న నైపుణ్యంను వెలికితీసేందుకు క్రికెట్ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గున్నంరెడ్డి భాస్కర్‌రెడ్డి, డి.కోటి, నాగరాజు, లోకేష్, వెంకటేష్ పాల్గొన్నారు.

వరికి తెగుళ్ల పోటు



రసాయనిక ఎరువులు సిద్ధం చేస్తున్న రైతులు



పురుగు మందు పిచికారీ చేస్తున్న రైతు

- వర్షంలా కురుస్తున్న పొగ మంచు
- ఉదయం 11 గంటలైనా కనిపించని ఎండ
- పంటలో కనిపించని ఎదుగుదల
- క్షేత్రస్థాయిలో పర్యటించని అధికారులు
- లబోదిబోమంటున్న రైతులు

ఈ ఏడాది రబీ సీజన్ ప్రారంభం నుంచి రైతులకు తిప్పలు తప్పడం లేదు. ఎన్నడూ లేని విధంగా వరుస వర్షాలతో వంకలు, వాగులు, నదులు ఉధృతంగా ప్రవహించాయి. చెరువులు నిండాయి. వర్షాలు తగ్గిన తర్వాత ఎంతో ఆశగా వరి పంటలు సాగు చేసిన రైతులను పొగ మంచు ఇబ్బందులకు గురి చేస్తోంది. వర్షంలా పొగమంచు కురుస్తోంది. ఎండ తగలకపోవడంతో పంట ఎదుగుదల లోపించింది. దీనికితోడు పంటను తెగుళ్లు ఆశించాయి. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి సలహాలు, సూచనలు ఇవ్వక పోవడంతో ఏమి చేయాలో దిక్కుతోచక రైతులు లబోదిబోమంటున్నారు.

వాకాడు: గూడూరు నియోజవర్గంలోని గూడూరు, చిల్లకూరు, కోట, వాకాడు, చిట్టమూరు మండలాల్లో ప్రస్తుతం 20.2 వేల హెక్టార్లలో వరి పంట సాగు చేశారు. అందులో గూడూరులో 3.5 వేల హెక్టార్లు, చిల్లకూరులో 3.7 వేలు, కోటలో 4 వేలు, వాకాడులో 4.5 వేలు, చిట్టమూరులో 4.5 వేల హెక్టార్లలో వరి సాగైంది. ప్రస్తుతం పంట ఎన్ను దశలో ఉంది. 50 నుంచి 60 రోజులు అవుతున్నా పంట సరైన స్థితిలో ఎదుగుదల లేదు. 22 రోజులుగా పంటకు ఎండ తగలడం లేదు. దీనికి తోడు పొగమంచు వానలో కురుస్తోంది. దీంతో తెగుళ్లు విజృంభించాయి. ముఖ్యంగా నల్లమచ్చ, అగ్గితెగులు, నల్లి, చిలుము మచ్చ, మోము పిప్పి తదితర తెగుళ్లు ఎక్కువగా సోకాయి. పంటలకు అవసరమైన ఎరువులు, పురుగు మందులు రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో లేవు. దీన్ని ఆసరాగా తీసుకున్న ప్రయివేట్ ఎరువుల దుకాణ యజమానులు అధిక ధరలకు విక్రయిస్తున్నారు. అధికారులు పంటలను పరిశీలించి సలహాలు, సూచనలు ఇవ్వాల్సి ఉండగా ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ సారి పంట దిగుబడులు బాగా తగ్గుతాయని ఆందోళన చెందుతున్నారు.

పెరిగిన సాగు ఖర్చులు

గతంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రైతులకు పంటల సాగుకు సాయం అందించేది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో సాగు ఖర్చులు విపరీతంగా పెరిగాయి. దీనికితోడు తెగుళ్లు ఎక్కువగా సోకడంతో పురుగు మందులు ఎక్కువగా పిచికారీ చేయాల్సి వస్తోంది. ఎకరాకు 3 లీటర్ల నుంచి 4 లీటర్లు వరకు పురుగు మందులు, 5 కేజీల నుంచి 10 కేజీల వరకు గుళికలు వాడాల్సి వస్తోందని రైతులు చెబుతున్నారు. రసాయనిక ఎరువులు 6 నుంచి 8 బస్తాల వరకు వాడుతున్నామని పేర్కొంటున్నారు. ప్రభుత్వం ఎరువులను అందుబాటులో ఉంచకపోవడంతో ప్రైవేటు దుకాణదారులు బస్తాపై రూ.50 నుంచి రూ.80 వరకు అధికంగా వసూలు చేస్తున్నారు.

గత ప్రభుత్వ హయాంలో..

గత ప్రభుత్వంలో అన్ని రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు కావాల్సిన పురుగు మందులు, ఎరువులు, వ్యవసాయ పనిముట్లు అందుబాటులో ఉండేవి. అధికారులతోపాటు సిబ్బంది గ్రామాల్లో రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించేవారు. ఎప్పటికప్పుడు పంటలను పరిశీలించి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించేవారు. నేడు ఆ పరిస్థితి లేదు.

తెగుళ్లు ఎక్కువగా సోకుతున్నాయి



గత 25 రోజులుగా కురుస్తున్న మంచు కారణంగా పంటలకు తీవ్రమైన తెగుళ్లు సోకుతున్నాయి. ఎన్ని మందులు చల్లినా తగ్గడం లేదు. ఈ సారి పంట ఎదుగుదల బాగా తగ్గింది. దిగుబడి వస్తుందో రాదోనని భయంగా ఉంది. ఇప్పటికే నాలుగు ఎకరాల పంటకు రూ.1.5 లక్షల పెట్టుబడి పెట్టాను.

–కె శ్రీనివాసులు, కాశీపురం

రోజూ మందులు చల్లుతున్నాం



పంటలపై పొగ మంచు అధికంగా కురవడం వల్ల నల్లమచ్చ, అగ్గిమచ్చ, చిలుము మచ్చలు ఏర్పడుతున్నాయి. వాటిని నివారించడానికి నానా తంటాలు పడుతున్నాము. వ్యవసాయ శాఖ అధికారులు కనిపించడం లేదు. రైతు సేవా కేంద్రంలో ఎరువులు లేవు. ప్రైవేట్‌లో అధిక ధరలకు కొనుగోలు చేయాల్సి వస్తోంది.

–వల్లం బాలయ్య, వాకాడు



పంటలపై దట్టమైన పొగ మంచు

ఉపాధి పనుల్లో అక్రమాలపై కలెక్టర్‌కు ఫిర్యాదు

డక్కిలి : మండల కేంద్రమైన డక్కిలి పంచాయతీలో ఉపాధి పనుల్లో అక్రమాలు జరిగాయని, విచారణ జరిపించాలని పలువురు గ్రామస్తులు కోరారు. తిరుపతి కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్‌కు ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ డక్కిలి పంచాయతీలో గతేడాది జూలై 1 నుంచి ఉపాధిహామీ పనుల్లో అక్రమాలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. గతంలో ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్‌ను తొలగించి టీడీపీ కార్యకర్త దందోలు పెంచలరెడ్డితో పనులు చేయిస్తున్నారని తెలిపారు. అతని ద్వారా బోగస్ జాబ్ కార్డులు సృష్టించి బోగస్ మస్టర్లు వేస్తూ పనులు చేయకుండానే చేసినట్లు చూపి నిధులు స్వాహా చేస్తున్నారని ఆరోపించారు. ప్రతి ఒక్క వర్క్ ఐడీకి ఒకే ఫొటోతో మస్టర్లు అప్‌లోడ్ చేస్తున్నారని తెలిపారు. డక్కిలి పంచాయతీలో ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో 200 కుటుంబాలు ఉన్నాయని, వారికి 100 రోజులు పనులు కల్పించకుండానే బోగస్ మస్టర్లు వేసి 100 రోజులు పని చేసినట్లు కొందరి పేర్లతో నిధులు డ్రా చేశారని పేర్కొన్నారు. కాలేజీల్లో చదువుకుంటున్న విద్యార్థులు, పంచాయతీలోని వారి, దివ్యాంగులు, వృద్ధులు, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ల పేర్లతో మస్టర్లు వేసి నిధులు దుర్వినియోగం చేశారని విన్నవించారు. డక్కిలి పంచాయతీలోని వర్క్ ఐడీ 1560444 అమృత్ సరోవర్, వర్క్ ఐడీ 1783728 డక్కిలి చిన్న చెరువు పనుల్లో సుమారు 50 బోగస్ జాబ్‌కార్డులు తయారు చేసి కూలీలు పని చేసినట్లు నిధులు గోల్‌మాల్ చేశారని వివరించారు. ఉపాధిలో జరుగుతున్న అవినీతి అక్రమాలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు.

ఉపాధి హామీ పనులు వేగవంతం

డక్కిలి : ఉపాధిహామీ పనులను వేగవంతం చేయాలని ఎంపీడీవో టి.గుణశేఖర్‌రెడ్డి తెలిపారు. ఆయన సోమవారం ఫీల్డ్ అసిస్టెంట్‌లు, టీఏలతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయలన్నారు. కూలీల సంఖ్య పెంచాలని సూచించారు. జాబ్‌కార్డు కలిగిన ప్రతి ఒక్క కటుంబానికీ 100 రోజులు పని దినాలు కల్పించాలని పేర్కొన్నారు. కూలీలకు కనీస గిట్టుబాటు కూలీ అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. అవతవకలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏపీవో లక్ష్మీనారాయణ, ఈసీ దామోదర్‌రాజు, టీఏలు గిరి, సరిత, బీఎఫ్టీ శివయ్య పాల్గొన్నారు.

కూటమి అరాచకాలపై పోరుబాట



మాట్లాడుతున్న కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి

పెళ్లకూరు : కూటమి ప్రభుత్వం చేస్తున్న ఆరాచకాలపై పెళ్లకూరు మండలం రోసనూరు గ్రామంలో ప్రజల పక్షాన పోరుబాట పడుతున్నట్లు డీసీసీబీ మాజీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి తెలిపారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తోందన్నారు. మద్యాన్ని ఏరులై పారిస్తోందన్నారు. గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్టు షాపులు నిర్వహిస్తున్నా పట్టించుకునే నాథుడు లేడన్నారు. సూపర్‌సిక్స్ పథకాల్లో భాగమైన తల్లికి వందనం, రైతులకు రూ.20 వేల పెట్టుబడి సాయం, ధాన్యానికి మద్దతు ధర, ఉచిత పంటల బీమా, మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం తదితర పథకాలను వెంటనే అమలు చేసేలా ప్రజల పక్షాన పోరుబాట సాగించేందుకు సన్నద్ధమైనట్టు చెప్పారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులపై పోలీసులు అక్రమ కేసులు పెడుతున్నారని ఆరోపించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు పోరుబాటను విజయవంతం చేయాలని కోరారు.

ముగిసిన గురునాథస్వామి గ్రామోత్సవాలు



ఊరేగుతున్న యారా గురునాథస్వామి

చిల్లకూరు : తూర్పుకనుపూరులో ఐదు రోజులుగా నిర్వహిస్తున్న యారా గురునాథ స్వామి గ్రామోత్సవాలు సోమవారం ముగిశాయి. స్వామి వారిని సంక్రాంతి చివరి రోజు నుంచి ఐదు రోజులు ఐదు గ్రామాల్లో ఊరేగించడం ఆనవాయితీ. స్వామిని తిరిగి తూర్పుకనుపూరు తీసుకువచ్చి శాంతింపజేస్తారు. ఇందులో భాగంగా ఈ ఏడాది సంక్రాంతి చివరి రోజైన బుధవారం తూర్పుకనుపూరు నుంచి బయలు దేరిన యారా గురునాథ స్వామి గ్రామోత్సం ఈదులవారిపాళెం, కోమరావారిపాళెం, పోసినవారిపాళెం, రావులవారిపాళెం గ్రామాలు పూర్తి చేసుకుని సోమవారం తిరిగి గ్రామానికి చేరుకుంది. దీంతో గ్రామోత్సవాలు ముగిసినట్లు ఆలయ అర్చకులు తెలిపారు. ఉత్సవాలను ముత్యాలమ్మ ఆలయ ఈవో నవీన్‌కుమార్ పర్యవేక్షించారు.

నేటి నుంచి ఉచిత ఆధార్ క్యాంప్

డక్కిలి : మండలంలోని లింగసముద్రం, డక్కిలి సచివాలయాల్లో మంగళవారం నుంచి 24వ తేదీ వరకు ఉచిత ఆధార్ క్యాంప్ నిర్వహించనున్నట్లు ఎంపీడీవో గుణశేఖర్‌రెడ్డి తెలిపారు. 6 ఏళ్ల లోపు పిల్లలకు ఆధార్ కార్డు మంజూరు చేస్తామని పేర్కొన్నారు. పిల్లలు ఆస్పత్రిలో పుట్టిన తేదీ సర్టిఫికెట్లు తీసుకురావాలని సూచించారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

వెంకటగిరి రూరల్ : వెంకటగిరి పట్టణంలోని సుదర్శనం నగర్ సచివాలయంలో సోమవారం వార్డు కౌన్సిలర్ ఆరిశంకరయ్య ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ తన వార్డులో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వం ఇళ్ల నిర్మాణం కోసం లబ్ధిదారుల నుంచి అర్జీలు స్వీకరిస్తోందని, అర్హులు పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

కండలేరులో 55.600 టీఎంసీల నీరు

రాపూరు : కండలేరు జలాశయంలో సోమవారం నాటికి 55.600 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. కండలేరుకు సోమశిల జలాశయం నుంచి 180 క్యూసెక్కుల నీరు వస్తోందన్నారు. అలాగే కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 950, లోలెవల్ కాలువకు 70, హైలెవల్ కాలువకు 110, మొదటి బ్రాంచ్ కాలువకు 70 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

డీఎస్పీ బాధ్యతల స్వీకరణ



డీఎస్పీ గీతాకుమారి

చిల్లకూరు : గూడూరు డీఎస్పీ వీవీ రమణకుమార్ బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో గ్రూప్–1లో ఎంపికైన గీతాకుమారి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఆమె మాట్లాడుతూ తాను గ్రూప్–1కు ఎంపికై శిక్షణ పూర్తి చేసుకున్న తర్వాత మొదటి పోస్టింగ్ గూడూరుకు ఇచ్చారని తెలిపారు. గూడూరు పట్టణంతోపాటు డివిజన్‌లోని అన్ని మండలాల్లో శాంతి భద్రతల పరిరక్షకు కృషి చేస్తానన్నారు. గూడూరు పట్టణంలోని కూడళ్లు, శివారు ప్రాంతాల్లో నిఘా పెడతామని, అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కు పాదం మోపుతామని పేర్కొన్నారు. నేరాల నియంత్రణకు ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకారం అందించాలని కోరారు.

వయోజనుల కోసం రాత్రి బడులు



వలంటీర్స్‌కు మెటీరియల్ అందజేస్తున్న ఎంపీడీవో

ఓజిలి: విద్య రాని వయోజనులకు రాత్రి బడులు ఎంతో ఉపయోగపడతాయని ఎంపీడీవో విజయలక్ష్మి తెలిపారు. స్థానిక వెలుగు కార్యాలయంలో సోమవారం రాత్రి బడుల వలంటీర్లకు శిక్షణ ఇచ్చారు. ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో రాత్రి బడులు నిర్వహించేందుకు అనుమతి ఇచ్చామన్నారు. నిరక్షరాస్యులకు వారి పేర్లు రాయడం, చదవడం నేర్పించేందుకు దోహదపడతాయని తెలిపారు. మండలంలో 288 మందికిగాను 29 మంది వలంటీర్లను నియమించామని తెలిపారు. గ్రామాల్లో నిరక్షరాస్యులను గుర్తించి పాఠశాలకు వచ్చేలా చూడాలని కోరారు. వలంటీర్స్‌కు మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం పద్మమ్మ, ఏపీవో ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

బైక్ చోరీపై పోలీసులకు ఫిర్యాదు

నాయుడుపేట టౌన్ : పట్టణంలోని రామకృష్ణాపురం వీధిలో ఇంటి ముందు నిలిపిన బైక్ చోరీకి గురైంది. బాధితుడు వరప్రసాద్ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వెంకటగిరి వ్యవసాయాధికారిగా పనిచేస్తున్న వరప్రసాద్ నాయుడుపేటలోని రామకృష్ణాపురం వీధిలో నివాసం ఉంటున్నాడు. ఆయన శనివారం రాత్రి బైక్‌ను ఇంటి ముందు నిలిపి నిద్రించాడు. ఆదివారం ఉదయం బైక్ కనిపించలేదు. సమీపంలో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించగా గుర్తు తెలియని వ్యక్తి బైక్‌ను చోరీ చేసినట్టు గుర్తించారు. ఈ మేరకు పోలీసుకు ఫిర్యాదు చేశాడు.

కోలాహలంగా ఫ్లెమింగో ఫెస్టివల్





కళాకారుల నృత్య ప్రదర్శనలు



పాటలు పాడుతున్న సింగర్స్





గీతాలు ఆలపిస్తున్న సినీ గాయని మంగ్లీ, పక్షుల కేంద్రానికి తరలివచ్చిన విద్యార్థులు, పర్యాటకులు



పక్షుల సందడి



వ్యూపాయింట్ వద్ద సందర్శకుల సందడి



చెట్లపై విడిది చేసిన విదేశీ పక్షులు



పర్యాటకులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

సూళ్లూరుపేట/దొరవారిసత్రం: సూళ్లూరుపేట, తడ, దొరివారిసత్రం మండలాలు కేంద్రాలుగా జరిగిన ఫ్లెమింగో ఫెస్టివల్స్ కోలాహలంగా సాగింది. కలెక్టర్ ఎస్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ ఇక్కడే ఉండి పండుగను ఘనంగా నిర్వహించారు. పర్యాటకులు పెద్ద సంఖ్యలో విచ్చేసి విదేశీ విహంగాలను తిలకించారు. తడ మండలం, భీములవారిపాళెం పడవల రేవులో విద్యార్థులు బోట్ షికార్ చేసి కేరింతలు కొట్టారు. సూళ్లూరుపేట ప్రభుత్వ హైస్కూల్ మైదానంలో నిర్వ హించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సినిమా హీరోయిన్లు కృతిశెట్టి, సంయుక్త మీనన్, ప్రముఖ సినీ గాయని మంగ్లీ సందడి చేశారు. టీవీ యాంకర్లు రవి, కావ్య యాంకరింగ్‌తో పండుగకు నిండుతనం తీసుకొచ్చారు. ఆఖరిరోజున మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, అనగాని సత్యప్రసాద్ ముఖ్యఅతిథులుగా విచ్చేసి విజేతలకు బహుమతులు అందజేశారు.

ఆటో ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట రైల్వే స్టేషన్ సమీపంలో సోమవారం ఆటో ఢీకొని వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల కథనం మేరకు.. నాయుడుపేటకు చెందిన నారాయణ ప్రతి రోజూ చెన్నై వెళ్లి సరుకులు తెచ్చి దుకాణాలకు అందజేస్తుంటాడు. అతను సోమవారం సాయంత్రం రైల్వే స్టేషన్ సమీపంలో రోడ్డు దాటుతుండగా తుమ్మూరు వైపు వెళుతున్న ఆటో ఢీకొంది. తీవ్రంగా గాయపడిన అతన్ని స్థానికులు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం ప్రైవేటు వైద్యశాలకు పంపించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కారు ఢీకొని..

పెళ్లకూరు : నాయుడుపేట–పూతలపట్టు జాతీయ రహదారిలో దొడ్లవారిమిట్ట గ్రామం వద్ద సోమవారం బైక్‌ను కారు ఢీకొనడంతో వ్యక్తి గాయపడ్డాడు. పోలీసుల కథనం మేరకు.. దొడ్లవారిమిట్ట గిరిజన కాలనీకి చెందిన గొడుగు వెంకటరత్నం భీమవరంలో పనులు ముగించుకుని బైక్‌లో స్వగ్రామానికి బయలుదేరాడు. రోడ్డు దాటుతుండగా నాయుడుపేటకు వెళుతున్న కారు అతివేగంగా వస్తూ ఢీకొంది. ఈ ఘటనలో వెంకటరత్నం తలకు తీవ్ర గాయాలయ్యాయి. అతన్ని స్థానికులు నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం నెల్లూరు తీసుకెళ్లారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.